క్లుప్తంగా

వివాహానికి వంట సామగ్రి



సామగ్రి అందజేస్తున్న సర్పంచ్ శివిబాయి

కుల్కచర్ల: అల్లాపూర్ గ్రామానికి చెందిన పాత్లవత్ హరిశ్చందర్ జెమినీబాయి దంపతుల కూతురు సునిత వివాహానికి సర్పంచ్ శివిబాయి బుధవారం ఒక క్వింటాలు బియ్యం, 15లీటర్ల వంటనూనె, 10కిలోల పప్పు తదితర వంట సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామ పరిధిలో ఏ ఆడబిడ్డ వివాహం జరిగినా.. సుమారు రూ.10 వేల వరకు వంట సామగ్రి ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, నరేష్, నర్సింగ్, అంబర్ సింగ్, ఉమ్లా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



తల్లిబిడ్డతో బంధువులు, 108 సిబ్బంది

ధారూరు: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ నిండు చూలాలిని ఆసుపత్రికి తరలిస్తుండగా.. 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం కాశీంపూర్ గ్రామానికి చెందిన వల్లికి పురిటి నొప్పులు రావడంతో కాన్పుకోసం తాండూర్ మెటర్నటీ ఆసుపత్రిలో చేరింది. రాత్రి సదరు మహిళలకు బీపీ ఎక్కువ కావడంతో.. సాధారణ ప్రసవం కష్టమని, వెంటనే హైదరాబాద్ నయాపూల్ ప్రసూతి ఆసుపత్రికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యురాలు చెప్పారు. దీంతో అక్కడి నుంచి 108లో ఈఎంటీ నర్సింహులు, పైలెట్ సంజీవ్‌లు నగరానికి బయలు దేరారు. మార్గ మధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో పురుడు పోశారు. అనంతరం తల్లీ బిడ్డను వికారాబాద్ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. తల్లీబిడ్డ క్షేమమని వాహన సిబ్బంది చెప్పారు.

ప్రయోగాలపై దృష్టి సారించాలి



నాసా ప్రాజెక్టు కిట్లతో విద్యార్థులు

తాండూరు టౌన్: విద్యార్థులు చిన్ననాటి నుంచే వినూత్న ప్రయోగాలపై దృష్టి సారించాలని డాక్టర్ అనిత, డాక్టర్ శిల్పిక సూచించారు. బుధవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని, విద్యార్థులకు నాసా ప్రాజెక్టుకు సంబంధించిన కిట్లను అందజేశారు. అనంతరం మాట్లాడారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. నేర్చుకునే తత్వాన్ని పెంపొందించుకోవాలని, ఉపాధ్యాయుల సహకారంతో ప్రాజెక్టు మోడల్‌లను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం వెంకట్, అకాడమిక్ కోఆర్డినేటర్ వీరస్వామి, డీన్ శివరామ్, నాసా ఇంచార్జి మానస తదితరులు ఉన్నారు.

అనంత జాతర షురూ



ఆలయంలో ప్రత్యేక పూజలు

అనంతగిరి: వికారాబాద్ అనంతగిరి గుట్ట అనంత పద్మనాభ స్వామి ఆలయ కార్తీక మాస పెద్ద జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి, గుడి ఎదుట ధ్వజారోహణం ప్రతిష్ఠించారు.

పల్లెల్లో ప్రచార జోరు



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రచారం జోరుగా సాగుతోంది. మండల పరిధి గ్రామాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు రోహిత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ తరుపున ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు కుటుంబ సభ్యులు రోహిత్, వెంకటేశ్ మహరాజ్, మాజీ జెడ్పీటీసీ రాకేష్, జయప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు పర్యటిస్తుండగా.. బీఆర్ఎస్ నుంచి ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి ఆర్తి, తల్లి ప్రమోదిని, నాయకులు, సర్పంచులు ప్రచారం చేస్తున్నారు. ఆయా పార్టీ మేనిఫెస్టోల గురించి ప్రజలకు వివరిస్తూ గెలిపించాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు తీరిన వంతెన వెతలు

• పిల్లర్లపై పరిచిన గట్టర్లు • మిగిలింది సీసీబెడ్లే • త్వరలో పూర్తికానున్న బ్రిడ్జి



పిల్లర్లపై అమర్చిన గట్టర్లు

ధారూరు: ఒక అడుగు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అన్నట్లుగా ఎనిమిదేళ్లుగా కాగ్నానదిపై కొనసాగుతున్న వంతెన పనుల్లో కదలిక వచ్చింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధారూరు మండలం స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై 2017లో రూ.4.62కోట్లతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. వివిధ కారణాలతో బ్రిడ్జి పిల్లర్లకే పరిమితమయింది. ఇలా అసంపూర్తిగా నిలిచిన బ్రిడ్జితో స్థానికులకు రవాణా కష్టాలు తీవ్రమయ్యాయి. ముఖ్యంగా వానాకాలంలో.. పూర్తిగా రాకపోకలకు అంతరాయం కలిగేది. వారం రోజులుగా పిల్లర్లపై గట్టర్లు అమర్చుతున్న నేపథ్యంలో శనివారం లారీపై నుంచి 27.50 టన్నుల బరువున్న ఒక గట్టర్ కిందపడి పనులకు ఆటంకం కలిగింది. మళ్లీ బుధవారం పనులు పునరుద్ధరించి పిల్లర్లపై మొత్తం 24 గట్టర్లు పరచడం పూర్తయింది. ఇక మిగిలింది సీసీ వేయడమే.



కొనసాగుతున్న వంతెన పనులు

పరిగిలో 'ప్రజా ఆశీర్వాదం'

• సీఎం కేసీఆర్ రాకతో.. స్తంభించిన ట్రాఫిక్
• వాహన వలయంలో చిక్కుకున్న అంబులెన్స్‌లు



ట్రాఫిక్ జాంలో నిలిచిన అంబులెన్స్



సభా ప్రాంగణం నుంచి రోడ్డుమీదకు వచ్చిన ప్రజలు

దోమ/ కుల్కచర్ల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. బుధవారం ఒక్కరోజే తాండూరు, పరిగి, కొడంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులు పైలెట్ రోహిత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి తరఫున వారివారి నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. తొలుత సీఎం కేసీఆర్.. హెలికాప్టర్ ద్వారా పరిగి పట్టణంలోని విద్యారణ్యపురిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు సాయంత్రం 4.45 గంటలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, పార్టీ పరిగి అభ్యర్థి, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సభా ప్రాంగణానికి వెళ్లారు. దీంతో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి స్తంభించిపోయింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ట్రాఫిక్‌లో.. అంబులెన్స్

ట్రాఫిక్ జాం కావడంతో కొడంగల్ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన ఒక అంబులెన్స్, హైదరాబాద్ నుంచి కొడంగల్ వైపు వెళ్లాల్సిన మరో అంబులెన్స్.. వాహనాల మధ్య చిక్కుకున్నాయి. సుమారు 20 నిమిషాల పాటు పోలీసులు శ్రమించి వాటికి దారి చూపారు.

ప్రసంగిస్తుండగానే వెలుపలికి

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తుండగానే జనం మధ్యలోనే లేచి ఇంటి ముఖం పట్టారు. దీంతో రోడ్లన్నీ జనసమూహంతో కిక్కిరిసిపోయాయి. అప్రమత్తమైన పోలీసులు వారిని నిలువరింప జేసి, సభ ముగింపు అనంతరం సీఎం వెళ్లాక వదిలి పెట్టడం గమనార్హం.

కృషి ఉంటే ఏదైనా సాధ్యమే



విద్యార్థులతో సీఐ శ్రీనివాస్ తదితరులు

వికారాబాద్ అర్బన్: ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యార్థి దశనుంచే కృషి, పట్టుదలతో పాటు క్రమశిక్షణ కూడా అవసరమని వికారాబాద్ సీఐ శ్రీనివాస్ అన్నారు. స్థానిక శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు నాసా నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా బుధవారం విజేతలను పాఠశాల యాజమాన్యం, సీఐ సన్మానించారు. అనంతరం సీఐ మాట్లాడారు. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. చిన్ననాటి నుంచే ఇష్టంగా చదువుకోవాలని సూచించారు. సైన్స్‌పై మక్కువ పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏజీఎం పల్లె వెంకట్, ఎగ్జిక్యూటీవ్ కోఆర్డినేటర్ సురేష్, వీరస్వామి, అకాడమిక్ డీన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

హయత్‌నగర్: మద్యం, గుడుంబా, గంజాయి లాంటి మత్తు పదార్థాలు అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు తెలిపారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం హయత్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి సరూర్‌నగర్ క్లస్టర్ పరిధిలోని హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, కందుకూరు, ఆమనగల్లు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు రూ.6.81 కోట్ల విలువైన మద్యం, గంజాయి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని, అక్రమంగా నిల్వ చేసిన రూ.32 లక్షల విలువైన బెల్లాన్ని పట్టుకున్నామని వెల్లడించారు. 290 కేసులు నమోదు చేశామని, 142 మందిని అరెస్టు చేశామని వివరించారు. బెల్ట్ షాపులు, గంజాయి వాడకంపై నిఘా పెంచామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం నిల్వ చేసినా, గంజాయి రవాణా చేస్తున్నట్లు ఎవరికైనా అనుమానం వస్తే టోల్‌ఫ్రీ నంబర్ 18004252325కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

కల్తీ ఆహారంతో అనారోగ్యం

ఇబ్రహీంపట్నం: కల్తీ ఆహారంతో అనారోగ్య సమస్యలు వస్తాయని, కల్తీని గుర్తించేందుకు వర్క్‌షాపులు ఎంతో అవసరమని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభ అన్నారు. డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగ కన్వీనర్లు డా. రజిత, డా. మల్లికార్జున్ ఆధ్వర్యంలో బుధవారం ఆహార కల్తీని గుర్తించేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడారు. నేడు ఆహార పదార్థాలన్నీ కల్తీమయంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఆహారం తినడం వలన అనేక వ్యాధులకు గురవుతున్నారని తెలితెలిపారు. విద్యార్థులు కల్తీ ఆహారంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రసాయణ శాస్త్ర విభాగం కళాశాలలో ప్రత్యేక సదస్సును నిర్వహించడం అభినందనీయని పేర్కొన్నారు.



సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నాయకులు

డీసీసీ ఉపాధ్యక్షుడు బీంరెడ్డి

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు బొలుసాని బీంరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు.. మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని వెల్లడించారు. కావున తెలంగాణ ప్రజలు ఆలోచించి, చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్‌ను గెలిపించాని కోరారు.

పార్టీలో చేరిన మాజీ సర్పంచ్..

సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు, కుల్కచర్ల మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి బీంరెడ్డి, సీనియర్ నాయకులు బాలముకుందం ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్‌లో ప్రతి ఒక్కరికీ గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో వేపూరి నర్సింహులు, అల్లం వెంకటేశ్, రసూల్‌నాయక్ ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్ టూ అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు మొగులయ్య, వెంకటేశ్, సాయన్న, నర్సింహులు, వినోద్, కుమ్మరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శిపై వ్యక్తి దాడి

పోలీస్ స్టేషన్లో కార్యదర్శుల ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కుల్కచర్ల: 'నా వద్ద ఆధార్ కార్డు తీసుకొని ఇళ్లు వస్తుందని చెప్పారు. కానీ నాకు ఇంత వరకు రాలేదు' అని ఓ వ్యక్తి పంచాయతీ కార్యదర్శిపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన కుల్కచర్ల పోలిస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మండల పరిధి లింగంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న టి.రాధ.. ఎప్పటిలాగే విధులు నిర్వహించేందుకు గ్రామానికి వెళ్లింది. అయితే ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన మల్లేశ్ అనే వ్యక్తి.. గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు ఎందుకు రాలేదని తనను బూతులు తిట్టడమే కాకుండా.. దాడికి పాల్పడ్డారని కార్యదర్శి రాధ ఆరోపించింది. ఇదే విషయమై మండల పంచాయతీ కార్యదర్శులతో చర్చించి, సదరు వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బీఆర్ఎస్‌దే విజయం

చేవెళ్ల: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, ఎమ్మెల్యేగా కాలె యాదయ్య హ్యాట్రిక్ తథ్యమని ఆ పార్టీ మండల సీనియర్ నాయకులు వనం మహేందర్‌రెడ్డి అన్నారు. ఎన్కేపల్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య తరుపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఇంటికి కేసీఆర్ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేస్తున్న కేసీఆర్ సర్కార్.. మళ్లీ రావాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి, భారీ మోజార్టీతో ఎమ్మెల్యేను గెలిపించుకోవాలని కోరారు. ఉప సర్పంచ్ బ్యాగరి లక్ష్మయ్య, వార్డు సభ్యులు యాదయ్య, శ్రీనివాస్ రెడ్డి, లచ్చిరెడ్డి, దేవదాస్, రవీందర్, వెంకటేశ్, గణేశ్ తదితరులు ఉన్నారు.

మా ఆయన్ని ఆదరించండి..

'మీతో నేను' కార్యక్రమం ద్వారా నిత్యం ప్రజల్లో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారం కోసం శ్రమించిన వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్‌ను ఆదరించాలని ఎమ్మెల్యే సతీమణి సబిత కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఎమ్మెల్యే సొంత గ్రామమైన కేరెళ్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, కారు గుర్తుకు ఓటువేసి తన భర్తను గెలిపించాలని సబిత అభ్యర్థించారు. అనంతరం సర్పంచ్ నర్సింహరెడ్డిని కలిసి ఆనంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రచారంలో జెడ్పీటీసీ సుజాత, మాజీ ఎంపీపీ ఉమాపార్వతి తదితరులు ఉన్నారు.

–ధారూరు



కేరెళ్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సబిత

మితిమీరిన బీఆర్ఎస్ నేతల దౌర్జన్యాలు

• ఓటుతో వారి ఆగడాలను అంతం చేయండి
• కాంగ్రెస్‌ను గెలిపించండి: హస్తం శ్రేణులు



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నేతలు

యాలాల: రాష్ట్రంలో అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు పెరిగాయని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటుతో వారి ఆగడాలకు అంతం పలకాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీత పిలుపునిచ్చారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి యాలాల మండలం దేవనూరు నుంచి బాకారం ఆంజనేయస్వామి ఆలయం పాదయాత్ర చేశారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ పాలనతో విసుగు చెంది, కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో అందరికీ మేలు జరగనుందని, అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. అందుకు చేతి గుర్తుకు ఓటు వేసి తాండూరు అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, యువజన విభాగం మండల మాజీ అధ్యక్షుడు మన్నాన్, నేతలు ఖాసిం, శ్రీనివాసచారీ, కేఎస్ఎస్, గంతల మైనొద్దీన్, గోరేపల్లి రమేష్, నాగప్ప, మాసుల ఖాసిం తదితరులు ఉన్నారు.

హస్తం హయాంలోనే అభివృద్ధి



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

• సీఎం కేసీఆర్ పాలనను వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు
• కాంగ్రెస్ వికారాబాద్ అభ్యర్థి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

మర్పల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి, అక్రమాల పాలనతో విసుగు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు.. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మొగిలిగుండ్ల సర్పంచ్ అంజమ్మ, ఆమె అనుచరులు మాజీ మంత్రి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా.. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. పదేళ్ల కాలంలో తెలంగాణకు బీఆర్ఎస్ చేసిందేమీ లేదని, తమ హయాంలోనే అన్ని వర్గాలకు మేలు జరిగిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని, ఆరు గ్యారంటీలను అర్హులకు అందజేస్తామని చెప్పారు. చేతి గుర్తుకు ఓటు వేసి, తనను గెలిపించాలని కోరారు.

గుర్తింపు లేదు..

బీఆర్ఎస్ పార్టీలో తగిన గౌరవం దక్కనందుకే కాంగ్రెస్‌లో చేరానని మొగిలిగుండ్ల సర్పంచ్ అంజమ్మ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో కొనసాగుతున్న ప్రచార కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆందన్ కనీస మర్యాద ఇవ్వలేదని ఆరోపించారు. అందుకే.. కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు వెల్లడించారు. పార్టీలో చేరిన వారిలో తంగడపల్లి బస్వరాజ్, గొరెకంటి బస్వరాజ్, ఆనందం, అబ్రహం, రాములు, పాండు, విఠల్, రాంచెంద్రి, వెంకటేశం, విఠల్, రవి, సూర్యపేట కృష్ణణ్, తుల్జారామ్ తదితరులు ఉన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేష్, పట్లూర్ ఎంపీటీసీ సురేష్, మాజీ సర్పంచ్‌లు వీరేశం, నర్సింహులు తదితరులు ఉన్నారు.

మీ ఎమ్మెల్యేను గెలిపిస్తారా..

చైర్‌పర్సన్ స్వప్నను ప్రశ్నించిన ముఖ్యమంత్రి కేసీఆర్

తాండూరు: ఏమ్మా.. మీ ఎమ్మెల్యేను ఈ సారి గెలిపిస్తారా? అని సీఎం కేసీఆర్ తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్‌ను ప్రశ్నించారు. బుధవారం తాండూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు వెళ్లిన ముఖ్యమంత్రికి చైర్‌పర్సన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడారు. ఈ సారి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని గెలిపిస్తారా అని చైర్‌పర్సన్‌ను అడగగా.. ఖచ్చితంగా గెలిపిస్తాం సార్ అని ఆమె సమాధానం ఇచ్చారు. కాగా గడిచిన మూడేళ్ల కాలంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి, చైర్‌పర్సన్ స్వప్నకు మధ్య గొడవ తారాస్థాయికి చేరిన విషయం తెలిసిందే. వాటన్నింటిని పక్కనపెట్టి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పనిచేయాలని గతంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చైర్‌పర్సన్‌ను సముదాయించారు. దీంతో ఎమ్మెల్యే గెలుపే లక్ష్యంగా ఆమె ఎన్నికల ప్రచారం సైతం చేస్తున్నారు.



సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న చైర్‌పర్సన్ స్వప్న



మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి సమక్షంలో పార్టీలో చేరిన ధన్నారం యువకులు

పూటకో పార్టీ.. రోజుకో మాట

వికారాబాద్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయం వేడెక్కుతోంది. కొందరు పూటకో పార్టీ మారుస్తూ.. రోజుకో మాట చెబుతూ ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారు. దీంతో ఎవరు ఏ పార్టీ తరపున ప్రచారం చేస్తున్నారో తెలియక ప్రజలు తికమక పడుతున్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధి 2వ వార్డు ధన్నారంలో కొందరు యువకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ వీడి.. ఏకంగా ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తెల్లవార గానే ఏమైందో ఏమో.. కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నట్లు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ అల్లుడి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు వేసుకొని, ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈ చిత్ర విచిత్రాలను చూస్తున్న ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు.



బుధవారం తిరిగి కాంగ్రెస్ కండువా కప్పుకొన్న అదే యువకులు